కర్మన్‌ఘాట్‌లో ఎమ్మెల్సీ కవిత పూజలు

ధ్యానాంజనేయ ఆలయ సన్నిధిలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 12: హనుమాన్ జయంతి సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్సీ కల్వ కుంట్ల ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి లావణ్య వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వేద పండితులు అభిషేకాలు, అర్చనలు చేసి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ సుదర్శన్ గౌడ్, మాజీ ధర్మకర్తలు మధు సాగర్, సతీష్ గౌడ్, కిరణ్ కుమార్ గుప్తా, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ కారిడార్‌లో భద్రతే లక్ష్యం

సైబరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో భద్రతే తమ లక్ష్యమని సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్సీఎస్సీ) సెక్రటరీ జనరల్ రమేశ్ కాజా స్పష్టం చేశారు. తాను అనేక దేశాల్లో పర్యటించానని.. ఐటీ కారిడార్‌లో భద్రత కోసం పనిచేసే ఎస్సీఎస్సీ లాంటి సంస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని ఆయన వెల్లడించారు. ఐటీ కారిడార్‌లో పౌరులు స్వేచ్ఛగా జీవించడం, కార్యకలాపాలు, వ్యాపారాలు చేసుకోవడం కోసం కృషి చేయడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్‌ను ఐటీ సంస్థలకు గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వివరించారు. ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ మీకోసం..

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ):

- హైదరాబాద్‌ను ఐటీకి గమ్యస్థానంగా మారుస్తాం
- ఎంఎన్‌సీలు ఇచ్చే నిధులతో పోలీసు శాఖకు సహకారం
- ఉద్యోగినుల కోసం 18 'షీ షటిల్' బస్సులు
- వందకుపైగా ట్రాఫిక్ మార్షల్స్
- 22 ట్రాఫిక్ బైక్‌లను అందజేశాం
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో ఎస్సీఎస్సీ సెక్రటరీ జనరల్ రమేశ్

నమస్తే తెలంగాణ: సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ నేపథ్యం, ముఖ్య ఉద్దేశం ఏమిటి?

రమేశ్ కాజా: సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ 18 ఏండ్ల క్రితం 2006లో ఏర్పడింది. లాభాపేక్ష లేని ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పౌరుల భద్రత. ఐటీ కంపెనీల్లో పని చేసే సిబ్బంది భద్రత, కంపెనీల్లో ఉగ్ర దాడులను అడ్డుకోవడం, విధ్వంసకర కార్యకలాపాల కోసం డేటా చోరీని నివారించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

నమస్తే తెలంగాణ: హైదరాబాద్, సైబరాబాద్‌ను ఐటీ సంస్థలకు గమ్యస్థానంగా నిలిపేందుకు మీరు రూపొందించిన ప్రణాళికలు ఏమిటి?

రమేశ్ కాజా: తెలంగాణ పోలీసు విభాగం, ఐటీ కంపెనీల ప్రతినిధుల సహకారంతో ఎస్సీఎస్సీ ఆరు అంశాలపై ప్రధానంగా పనిచేస్తుంది. పౌరుల వ్యక్తిగత భద్రత, మహిళలు/చిన్నారులు, యువత, ట్రాఫిక్– రోడ్డు, సైబర్, ఆరోగ్య భద్రత సంస్థ లక్ష్యం. సైబరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఈ సంస్థకు చైర్‌పర్సన్‌గా, వైస్ చైర్‌పర్సన్‌గా సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఉంటారు. తర్వాత సెక్రటరీ జనరల్, కన్వీనర్లుగా డీసీపీలు, సంఘసేవ చేయాలనుకునే ఐటీ సంస్థల హెడ్‌లు ఈ సంస్థలో సభ్యులుగా ఉంటారు.

నమస్తే తెలంగాణ: సైబరాబాద్‌లో ఉద్యోగుల భద్రత కోసం సంస్థ చేపట్టిన కార్యక్రమాలు ఏమిటి?

రమేశ్ కాజా: ఐటీ సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రత కోసం 18 'షీ షటిల్' బస్సులను సంస్థ ద్వారా నడుపుతున్నాం. ప్రతినెల 1.80 లక్షల మంది మహిళా ఉద్యోగులు ఈ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మహిళా ఉద్యోగులు వసతి పొందుతున్న 1,200కు పైగా హాస్టళ్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. ఐటీ సంస్థల్లో 950 మంది వరకు మార్గదర్శక్, సంఘమిత్రలను నియమించాం. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఈ ప్రతినిధులు పోలీసుల సాయంతో వారిపై చర్యలు తీసుకునేలా చేస్తారు. గృహ హింసకు గురైన ఉద్యోగినులకు కూడా పోలీసులతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరిస్తారు. 'షీ సేఫ్' యాప్ ఏర్పాటు చేసి మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. 5 వేల మందికి పైగా ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. స్వీయ రక్షణపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. వివిధ ప్రాంతాలు, రాష్ర్టాల నుంచి హైదరాబాద్‌లో పనిచేసేందుకు తమ పిల్లలను తల్లిదండ్రులు ఎలాంటి భయం లేకుండా పంపేందుకు వీలుగా హాస్టళ్లకు సేఫ్టీ రేటింగ్స్ ఇస్తున్నాం.

నమస్తే తెలంగాణ: రోడ్డు, ట్రాఫిక్ సేఫ్టీ ఫోరమ్ ఎలా పని చేస్తుంది?

రమేశ్ కాజా: ఎస్సీఎస్సీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌గా ఉన్న ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 100కు పైగా ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమించాం. ఈ చలాన్లలో ఏఐ కెమెరాలు, పౌరులకు ట్రాఫిక్ అలర్ట్ ఇచ్చే వాట్సాప్ బాట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఐటీ సంస్థల నుంచి వస్తున్న నిధులతో 22 తెలుపు రంగు ట్రాఫిక్ బైక్‌లు, ఒక టోయింగ్ వెహికల్, ఒక డ్రోన్‌ను పోలీస్ శాఖకు అందజేశాం. ఈ నెలలో దాతల నుంచి సేకరించిన సీఎస్ఆర్ ఫండ్స్‌తో 12 యాక్టివా వాహనాలను పోలీసు శాఖకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 250కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం. ఐటీ కారిడార్‌లో భద్రతపై పోలీస్ కమిషనర్, సంస్థ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం.

నమస్తే తెలంగాణ: చైల్డ్, యువత భద్రతకు మీరెలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రమేశ్ కాజా: యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య యాంటి డ్రగ్స్. దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. చిన్నారులు, యువతుల వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మెంటల్ సేఫ్టీ, సైబర్ సేఫ్టీపై విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నాం. ఐటీలో పనిచేసే ఉద్యోగులకు సీపీఆర్, ఫిట్‌నెస్, యోగాపై అవేర్‌నెస్ కల్పిస్తున్నాం. వీటితో పాటు ఒత్తిడి, డయాబెటిస్, హైపర్ టెన్షన్, క్యాన్సర్, గుండె సంబంధిత అనారోగ్య సమస్యలపై అవగాహన కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. రోడ్డు భద్రతకు సంబంధించి సైబరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నాం. సమస్య ఉన్న ప్రాంతాలను డ్రోన్ కెమెరాలతో ఫొటోలు తీసి, పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరిస్తున్నాం. ఐటీ కారిడార్‌లో భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. ఐటీ కంపెనీల క్యాబ్ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. సంస్థకు ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రతి రూపాయిపై ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహిస్తాం.

ఊహా నగరికి మెరుపులా?

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు చేసి... జనాలకు దూరంగా మెట్రో నిర్మిస్తామని ప్రకటించింది.

ఊహానగరికి మెరుపులు..

కలల ప్రపంచంలో జనాలను తేలియాడేలా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఫ్యూచర్ సిటీని కూడా ఊహాత్మక ప్రకటనలతో పబ్బం గడుపుతోంది. నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతాలకు మెట్రో విస్తరణను నిర్లక్ష్యం చేస్తోంది. ఎంతో కీలకమైన మెట్టుగూడ–ఈసీఐఎల్, రాయదుర్గం నుంచి శంషాబాద్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వంటి మార్గాలకు రావాల్సిన మెట్రో వెనుకబడి పోతున్నది. రెండో దశ విస్తరణ పేరిట ఫ్యూచర్‌కి మెట్రోను ప్రకటించిన రేవంత్ రెడ్డి... గత కొన్నేళ్లుగా మెట్రో కోసం పడిగాపులుగాస్తున్న నార్త్ సిటీ ప్రజల అవసరాలను గుర్తించలేకపోయారు. నార్త్ సిటీ మెట్రో ద్వారా కోర్ సిటీకి నిత్యం 5–6లక్షల మంది ప్రయాణించే వెసులుబాటు ఉన్నా... ఈ ప్రాజెక్టును కనీసం విస్తరణ జాబితాలో చేర్చలేదు. ఎన్నో ఆందోళనలు, ఎంతోమంది నార్త్ సిటీ వాసులు నిరసనలతో రోడ్డెక్కితే గానీ నార్త్ సిటీకి చోటు కల్పించలేదు.

డీపీఆర్‌కే దిక్కులేదు...

ఫేస్–2 పార్ట్ బీగా నార్త్ సిటీ మెట్రోకు డీపీఆర్ రూపకల్పన చేసి మార్చి నెలాఖరులోగా కేంద్రానికి పంపుతామంటూ సర్కారు ప్రకటన చేసింది. కానీ ఇప్పటివరకు డీపీఆర్‌కు దిక్కు లేకుండా పోయింది. అదే ఫ్యూచర్ సిటీకి మాత్రం హడావుడిగా సమీక్షలు నిర్వహించి... మెట్రో పరుగులు పెట్టినంత ప్రచారం చేసుకుంటోంది. ఈ ప్రాజెక్టుతో జనాలకు ఒరిగేదేమీ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంటే.. ప్రస్తుతం నగరవాసులకు అవసరమైన కీలకమైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ఎన్నో ఏళ్లుగా లక్డీకాపూల్ నుంచి మెహదీపట్నం మీదుగా ఐటీ కారిడార్ వెళ్లేందుకు మెట్రో నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర నుంచి ఒక్కసారి ఈ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించలేదు. కనీసం ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా ఇప్పటివరకు చర్చించలేదు. కానీ అవసరమే లేని ఫ్యూచర్ సిటీ కోసం మాత్రం కాంగ్రెస్ సర్కారు చూపుతున్న ఉత్సాహం ఎందుకనేది ఇప్పుడు ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఖజానా లేకున్నా...
ప్రణాళికలతో సరి

కాంగ్రెస్ సర్కారు ఖాళీ ఖజానాతో ఈ ప్రాజెక్టులు ఎలా చేపడుతుందనేది ఇప్పుడు అంతు చిక్కడం లేదు. అందుకే రెండో దశ మెట్రో విస్తరణకు రూ. 24వేల కోట్ల అంచనాతో ప్రణాళికలు సిద్ధం చేసినా... ఇందులో కేంద్రం నుంచి ఇతర ఆర్థిక సంస్థలు ముందుకు వచ్చి సాయం అందిస్తే తప్పా ప్రాజెక్టును మొదలుపెట్టే అవకాశం లేదు. కానీ ప్రభుత్వం మాత్రం కాగితాలపై ప్రణాళికలతో సరిపెడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఏపీ ఇంటర్ ఫలితాలలో అగ్రగామిగా నారాయణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు ఉత్తమ ఫలితాలతో అగ్రగామిగా నిలిచాయి. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులతో ఒకరు స్టేట్ ఫస్ట్ ర్యాంక్, 467మార్కులతో 8మంది, 466 మార్కులతో 55 మంది విజయం సాధించారు. జూనియర్ బైపీసీలో 440మార్కులకు గాను 436 మార్కులతో నలుగురు విద్యార్థులు, 435 మార్కులతో 27 మంది విద్యార్థులు విజయం సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 992మార్కులతో ముగ్గురు విద్యార్థులు, 990 మార్కులతో 39మంది, 989మార్కులతో 93 మంది, 988మార్కులతో 181 మంది విజయం సాధించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డా.పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ మాట్లాడుతూ.. ఏపీలోని ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులతో 22శాతం ఫలితాలు నారాయణ విద్యార్థులే సాధించారన్నారు.

సంస్కృతిని తెలిపే గొప్ప ప్రక్రియ అవధానం

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 12. మన సంస్కృతిని తెలియజేసే గొప్ప ప్రక్రియ అవధానం అని శాసన మండలి సభ్యురాలు డాక్టర్ సురభివాణీదేవి అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజ–పద్యం, అవధాన విద్యా వికాస పరిషత్ సంయుక్తాధ్వర్యంలో నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జరగనున్న సంపూర్ణ శతావధానం కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వర రావు, గ్రంథాలయ పరిషత్తు పూర్వ అధ్యక్షులు అయాచితం శ్రీధర్ , తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ప్రముఖ సాహితీవేత్త వనం జ్వాలా నర్సింహారావు, సాహితీవేత్తలు పెరంబుదూరు శ్రీరంగాచార్య, దర్శనం సంపాదకులు మారుమాముల వెంకటరమణశర్మ, నిర్వాహకులు నారుమంచి వెంకటకృష్ణ, మారుమాముల దత్తాత్రేయ శర్మ, రం శతావధాన పూర్ణచంద్ర డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పాల్గొన్నారు.

ఏపీ ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్యకు స్టేట్ టాప్ మార్కులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు స్టేట్ టాప్ మార్కులతో విజయం సాధించాయి. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను బుక్కె విశ్వనాథ్ నాయక్, ముంద్రు వినూత్న 467 మార్కులతో స్టేట్ టాప్ ర్యాంక్, 466 మార్కులతో 48మంది, 465 మార్కులతో 291 మంది విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకు గాను 437 మార్కులతో చెల్ల లేఖన స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను, 436 మార్కులతో 16 మంది, 435 మార్కులతో 109మంది విద్యార్థులు విజయం సాధించారు.

సీఎంఆర్ వెబ్‌సైట్, క్యారెట్ కాయిన్ ఆవిష్కరణ

క్యారెట్ కాయిన్‌ను ఆవిష్కరిస్తున్న యాంకర్ సుమ, సింగర్ సునీత, మేనేజింగ్ డైరెక్టర్లు.. సునీతా కుమారి అల్లాక, అల్లాక గనేశ్వర్, అల్లాక రోహన్

మాదాపూర్, ఏప్రిల్ 12: అనేక సంవత్సరాలుగా సాంప్రదాయ, ఆధునిక పద్ధతిలో నాణ్యమైన, నమ్మకంతో కూడిన బంగారు ఆభరణాలను తయారు చేస్తూ సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రజల ఆధారాభిమానాలతో విశేష సేవలందిస్తున్న సీఎంఆర్ లేగసి ఆఫ్ జ్యువెలర్స్ నూతనంగా మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ లో శనివారం cmrjewellers.com పేరుతో వెబ్‌సైట్‌తో పాటు క్యారెట్ కాయిన్‌ను వినియోగదారుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చింది.ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ సింగర్ సునీత, యాంకర్ సుమ చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు. cmrjewellers.com వెబ్‌సైట్ లో 10 వేల కంటే ఎక్కువ డిజైన్స్ తో కూడిన సంప్రదాయ అధునాతన ఆభరణాలు అందుబాటులో ఉంటాయని, సీఎంఆర్ లెగసీ ఆఫ్ జ్యువెలరీ ఆభరణాలను అభిమానించే అమెరికా, లండన్, ఆస్ట్రేలియాతో పాటు ప్రపంచ దేశాల్లో ఉండే ఎన్ఆర్ఐ కస్టమర్ల కోసం ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. నాణ్యమైన, నమ్మకమైన బంగారు ఆభరణాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆన్లైన్‌లో షాపింగ్ చేయొచ్చని, వెబ్‌సైట్‌తో పాటు క్యారెట్ కాయిన్‌ను పరిచయం చేయడం సంతోషంగా ఉందని సీఎంఆర్ జ్యువెలరీ సీఎండీ సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ సునీతాకుమారి అల్లాక తెలిపారు. ఏప్రిల్ 12 నుంచి అక్షయ తృతీయ వరకు సైన్ అప్ చేసుకున్న కస్టమర్లకు రూ.లక్ష విలువగల క్యారెట్ నాణేలను అందించనున్నట్లు చెప్పారు. 11 నెలలకు సువర్ణ ప్రాప్తి పర్చేస్ ప్లాన్ లో ఫస్ట్ పేమెంట్‌గా క్యారెట్ కాయన్‌ని వినియోగించుకోవచ్చు అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని సీఎంఆర్ లెగసీ ఆఫ్ జ్యువెలరీ స్టోర్‌లలో ఏప్రిల్ 12 నుంచి అక్షయ తృతీయ వరకు ప్రతి కస్టమర్‌కు బంగారు నాణేలు, వెండి కాయిన్స్ గెలుచుకునే అవకాశంతో పాటు మరెన్నో అద్భుతమైన ఆఫర్లను అందించనున్నట్లు తెలిపారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

బహిరంగ సభను విజయవంతం చేద్దాం

కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలదే బాధ్యత

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మల్లాపూర్ డివిజన్ వీఎన్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సన్నాహక సమావేశం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్ నుంచి 300 మంది వరకు రావాలని, ఇందుకు కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం చలో వరంగల్ పేరిట ఉన్న బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బోలో అరుదైన ఆపరేషన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): 'ప్లాసెంటా పెర్కెటా' అనే అరుదైన రుగ్మతతో బాధపడుతున్న ఓ గర్భిణికి విజయవంతంగా ప్రసవం జరిపి రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు సరికొత్త రికార్డు సృష్టించారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన 26 ఏళ్ల గర్భిణి సాధారణ పరీక్షల్లో భాగంగా 32వారాల సమయంలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని బర్త్ రైట్ రెయిన్‌బో బై రెయిన్‌బో హాస్పిటల్‌ను సంప్రదించారు. ఈ క్రమంలో వైద్యులు గర్భిణికి స్కానింగ్ జరపగా 'ప్లాసెంటా ప్రెర్కెటా' అనే అరుదైన రుగ్మత ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. ప్లాసెంటా పెర్కెటా సమస్య ఉన్న వారిలో ప్లాసెంటా అనేది అసాధారణంగా గర్భాశయ గోడకు అంటుకుని ఉండటమే కాకుండా, మూత్రాశయం, ప్రేగు వంటి సమీపంలోని అవయవాలపై ఇది దాడి చేస్తుంది. ఫలితంగా ప్రసవ సమయంలో విపత్కర రక్తస్రావం అయ్యే అవకాశాలుంటాయి. అంతేకాకుండా రోగికి తరచుగా భారీ రక్తమార్పిడి అవసరం ఉంటుంది. ఈ పరిస్థితి తల్లీబిడ్డలిద్దరికీ ప్రమాదకరమని రెయిన్‌బో హాస్పిటల్స్ కన్సల్టెంట్, ప్రముఖ గైనకాలజిస్ట్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ హిమబిందు తెలిపారు. ప్రసవం సమయంలో తీవ్ర రక్తస్రావ పరిస్థితి తలెత్తకుండా 35 వారాలలోనే డెలివరీ చేయాలని నిర్ణయించుకుని, ఆ మేరకు ప్రణాళిక రూపొందించామని డా.బిందు వివరించారు. ఈ క్రమంలోనే డాక్టర్ హిమబిందు మల్టీడిసిప్లినరీ బృందం, అనస్థీషియాలజిస్టులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గీత, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ విపిన్ గోయెల్, స్టార్ హాస్పిటల్స్ నుంచి ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మహేష్, నర్సింగ్ సిబ్బంది కలిసి ఇంటర్వెన్షనల్ రేడియాలజీని ఉపయోగించి దాదాపు 6గంటల పాటు క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా ప్రసవం జరిపినట్లు వైద్యనిపుణులు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగానే ఉన్నారని, క్రమంగా కోలుకుంటున్నట్లు తెలిపారు.

రామకృష్ణ మఠంలో వేసవి శిక్షణా శిబిరాలు

కవాడిగూడ, ఏప్రిల్ 12: రామకృష్ణ మఠంలో వేసవి శిక్షణా శిబిరాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద తెలిపారు. 4వ తరగతి నుంచి 10 తరగతి వరకు విద్యార్థులకు వేర్వేరుగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అడ్మిషన్ కావాలనుకునే వారు తమ చిన్నారుల స్కూల్ ఐడెంటిటీ కార్డుతో రామకృష్ణ మఠంలోని వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఏడవ తరగతి విద్యార్థులకు ఈ నెల 28 నుంచి మే 11వరకు.. అదేవిధంగా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మే 12 నుంచి 25 వరకు సంస్కార్ పేరిట వేసవి విద్యాశిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల14 నుంచి 24 వరకు శ్రద్ధ పేరిట వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. మరింత సమాచారం కోసం 040 27627961 లేదా 91772 32696 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

ఇంకా జీతాలు రాలే!

- ఎంఎన్‌జేలో 12 తారీఖొచ్చినా జీతాలు రాలే
- ఇంటి అద్దెలు, ఈఎంఐలు కట్టేదెలా అంటూ సిబ్బంది సతమతం
- కొందరికే సకాలంలో వేతనాలు పడిన వైనం

సిటీబ్యూరో/తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్12,(నమస్తే తెలంగాణ): ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ప్రతినిత్యం క్యాన్సర్ రోగులకు సేవలందించే రెగ్యులర్ సిబ్బందికి నేటి వరకు వేతనాలు తమ ఖాతాల్లోకి జమకాలేదు. ఎంఎన్‌జే నియామకం చేసిన వారికి ఒకటో తేదీనే వేతనాలు వారి ఖాతాల్లో పడగా, డీఎంఈ, డీహెచ్ పరిధిలో పనిచేసే మిగిలిన రెగ్యులర్ సిబ్బందికి పన్నెండు తారీఖొచ్చినా వేతనాలు రాలేదు. దీంతో ఇంటి అద్దెలు, ఈఎంఐలు కట్టేదెలా అంటూ మదనపడుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులను రెండు భాగాలుగా విడదీసి వేతనాల్లో కోతలు పెట్టడం సరికాదని వాపోతున్నారు.

ప్రతిరోజూ 100 మందికిపైగా..

ఎంఎన్‌జేకు ప్రతిరోజూ 100 మందికి పైగా కొత్త రోగులు వస్తుండగా, ఇన్ పేషెంట్లు 300 మంది వరకు చికిత్స పొందుతుంటారు. వివిధ విభాగాల్లో సుమారు 1000 మందికి పైగా సిబ్బంది పని చేస్తుంటారు. వీరిలో డీఎంఈ, డీహెచ్ పరిధిలో స్టాఫ్ నర్సులు, డాక్టర్లు, నాలుగో తరగతి, మూడో తరగతి ఉద్యోగులు, పరిపాలనా విభాగపు ఉద్యోగులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు కలిపి సుమారు 130 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పన్నెండో తేదీ వచ్చినా కూడా వారి ఖాతాల్లో జీతం జమకాలేదు.

అప్పులు చేస్తున్నారు..

గతంలో ఎంఎన్‌జే స్వయం ప్రతిపత్తి హోదా కారణంగా రెగ్యులర్ సిబ్బందిని నియమించింది. ఇందులో భాగంగా స్టాఫ్ నర్సులు 78 మంది, వైద్యులు 10 మంది నియామకమయ్యారు. వీరికి మాత్రం సకాలంలో వేతనాలు తమ ఖాతాల్లోకి పడుతుండటం గమనార్హం. ఎంఎన్‌జేలో పనిచేసే కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా సకాలంలో వేతనాలు వారి ఖాతాలో పడ్డాయి. కానీ రెగ్యులర్ వారికి మాత్రం పడటం లేదు. గతంలో కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు వైద్య రంగానికి ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదో తారీఖు తరువాత వేతనాలు పడుతుండటం, ఇప్పుడైతే ఏకంగా నెలలో సగం రోజులు గడిచినా కూడా జీతాలు చేతికి రావడం లేదు. ఈ కారణంగా ఇంటి అద్దెలు, నెలనెల చెల్లించే ఈఎంఐలు, పరీక్షల సమయం కావడం వల్ల పిల్లల ఫీజులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి డైరెక్టర్ వేతనాల విషయంలో చొరవ చూపడం లేదన్న వాదన మరోవైపు వినిపిస్తుండటం గమనార్హం.

ఒకటో తారీఖునే జీతాలు వేయాలి



జీతం రాక అప్పు చేసి ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు కడుతున్నాం. గతంలో ఒకటో తారీఖునే జీతం పడుతుండేది. ప్రస్తుతం నెలలో సగం రోజులు గడిచినా జీతం చేతికి రావడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులను రెండుగా చేసి మాకు అన్యాయం చేసింద్రు. జీతం ఖాతాల్లో జయం చేయండి.

– శివకుమార్, టీఎన్‌జీవో యూనియన్ ఎంఎన్‌జే ఆసుపత్రి అధ్యక్షుడు

కుక్కలు.. భౌబోయ్!

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రుల్లో రేబిస్ వ్యాక్సిన్ నిల్వలు ఉండాలి. కానీ ఆ మేరకు లేవని, అందుకే చాలా మంది ప్రైవేటును ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. అయితే నగరంలో కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియ ఎంతమేర పకడ్బందీగా జరుగుతున్నదనే దానిపై వైద్యులే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక వీధిలోఉన్న కుక్కను స్టెరిలైజేషన్ చేశామంటూ దానిని మరో వీధిలో వదిలిపెడుతున్న ఉదంతాలు ఉన్నాయని ఫీవర్ ఆస్పత్రికి వచ్చిన బాధితుడి బంధువు ఒకరు చెప్పారు. కాగా, కుక్కకాటుకు గురైన వెంటనే అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో ఫీవర్ ఆసుపత్రి తోపాటు నారాయణగూడలోని ఐపీఎంలో వ్యాక్సినేషన్ ఇస్తున్నారు.

గతేడాది ఏప్రిల్–జూన్ వరకు ఫీవర్ ఆస్పత్రిలో 2700 కుక్క కాటు కేసులు నమోదవ్వగా, ఏకంగా 24 మంది మృత్యువాతపడ్డారు. ఈసారి కేవలం ఈ నెల 8–11 వరకు అంటే వారం రోజుల వ్యవధిలోనే 603 కేసులు నమోదు కాగా.. రేబిస్ సోకి విషమ పరిస్థితిలో ఫీవర్ ఆస్పత్రికి వచ్చి చనిపోయిన కేసు ఒకటి నమోదైనట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

కుక్క కరిస్తే వెంటనే ఏం చేయాలి?

- కుక్క కరిచిన చోట ముందుగా సబ్బుతో శుభ్రంగా కడగాలి. ఆసుపత్రికి తరలించాలి.
- వైద్యులు గాయం తీవ్రతను బట్టి చికిత్సనందిస్తారు. కుక్కకాటును రెండు రకాలుగా పరిగణిస్తారు.
- పెంపుడు కుక్కలు కరిస్తే వాటికి ఇదివరకే వ్యాక్సినేషన్ వేయించారా?లేదా అన్న విషయాలు పరిగణలోకి తీసుకొని చికిత్స నందిస్తారు.
- వీధి కుక్కలు కరిస్తే శరీరంపై కరిచిన భాగాలను బట్టి తప్పనిసరిగా ఇమ్యునోగ్లోబిన్, వ్యాక్సినేషన్ బాధితునికి ఇచ్చి చికిత్స కొనసాగిస్తారు.
- చిన్నారులు, వృద్ధులు వీటి బారిన పడే ఆస్కారం మరింతగా ఉంటుంది. బయటికి వెళ్లే తరుణంలో కర్రను తీసుకెళ్లడం ఉత్తమం. కుక్కల ప్రవర్తనలో తేడా కనిపించినా, వాటి నోటి నుంచి నురగలాంటిది వెలువడినా పిచ్చి కుక్కగా గుర్తించి జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించాలి.

నిర్లక్ష్యం చేయకండి..

కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించండి. లేదంటే రేబిస్‌వచ్చి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇంటివద్ద, పనిప్రదేశాల్లో కుక్కలకు దూరంగా ఉండండి. పెంపుడు కుక్కలు సైతం ఇతరులను కరవకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్